క్లుప్తంగా

11 నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె



సమ్మె నోటీస్ అందజేస్తున్న కార్మికులు

మెట్‌పల్లి: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 11 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు సమ్మెకు వెళ్లనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఉస్మాన్ పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక కార్మికులతో కలిసి శుక్రవారం కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్‌కు సమ్మె నోటీసును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కార్మికులకు వేతనాలు పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించే విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. వీటితో పాటు పలు సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మధురమ్మ, శ్రీకాంత్, రవి, సురేశ్ తదితరులున్నారు.

పనులు త్వరగా పూర్తిచేయండి



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న చైర్మన్

జగిత్యాల: పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్ అన్నారు. టవర్‌సర్కిల్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే రూ.10 లక్షలు కేటాయించగా శుక్రవారం పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం పరిశీలన



శిబిరాన్ని పరిశీలిస్తున్న సమియొద్దీన్

కథలాపూర్: మండలంలోని పోతారం గ్రామంలో శుక్రవారం పీహెచ్‌సీ వైద్యుల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఇందులో 105 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కాగా వైద్యశిబిరాన్ని వైద్యశాఖ జిల్లా ప్రోగ్రామింగ్ ఆఫీసర్ ఎండీ సమియొద్దీన్ పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న వైద్యం తీరుపై వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట వైద్యాధికారి రచన, సర్పంచ్ ధర్మపురి జలందర్ ఉన్నారు.

ఐదో రోజుకు భాగవత సప్తాహ పారాయణం



పారాయణంలో పాల్గొన్న మహిళలు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి గ్రామ శివారులోని సురభి గోశాలలో ప్రారంభమైన భాగవత సప్తాహ పారాయణం శుక్రవారం ఐదో రోజుకు చేరింది. మహిళలు గోశాలలో ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు పూటూరి అశోక్‌బాబు, రమాదేవి, ఓంకార్ నాథ్, నవత తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

సారంగాపూర్: మొక్కజొన్న పంటలో అధిక దిగుబడుల సాధించేందుకు రైతులు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. మండలంలోని పెంబట్ల గ్రామంలో ఆగ్రోస్ సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులు, అభ్యుదయ రైతు బండారి వెంకటేశ్ సాగుచేసిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. సాగు విధానంలో వెంకటేశ్ అవలంబించిన ఆధునిక పద్ధతులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలను పాటించి అధిక దిగుబడులు సాధించడానికి తీసుకున్న చర్యలను తెలియజేశారు. అనంతరం ఆగ్రోస్‌సేవా కేంద్రం ఆధ్వర్యంలో వెంకటేశ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఆగ్రోస్ ప్రతినిధి ఆరె మహేశ్, రైతులు మైదం ప్రభాకర్, లక్ష్మణ్, చిరంజీవి, రవి తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారం.. గొప్ప పథకం

• జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీచైర్‌పర్సన్, కలెక్టర్

జగిత్యాల: సీఎం కేసీఆర్ విద్యార్థుల కోసం అల్పాహార పథకం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ధరూర్ క్యాంప్‌లోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గొప్ప ఆలోచన విధానంతో ఈ పథకాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ఇప్పటికే మన ఊరు మన బడి పథకం ద్వారా ఎన్నో మౌలిక వసతులు ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, విద్యార్థులు రక్తహీనతతో బాధపడకుండా ఉండాలనే ఉద్దేశంతో అల్పాహార పథకం అందించడం జరుగుతుందని తెలిపారు. కలెక్టర్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ, సీఎం అల్పాహార పథకాన్ని పటిష్టంగా అమలు పర్చాలని ఆదేశించారు. జిల్లాలో మొదటి దశలో మన ఊరు బడి పథకంలో 274 పాఠశాలల్లో పనులు నిర్వహించుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్ శ్రీలత, కమిషనర్ అనిల్ బాబు, డీఈవో జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళబంధు సీఎం కేసీఆర్

జగిత్యాల: మహిళల కోసం సీఎం అనేక పథకాలు అమలు చేస్తున్నారని, మహిళ బంధు సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం దేవిశ్రీ గార్డెన్స్‌లో బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కమిషనర్ అనిల్‌బాబు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని 3వ వార్డుకు చెందిన వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరగా, పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. మైనార్టీ పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్, సత్యం, హమీద్, శివకేసరిబాబు, నవీన్ పాల్గొన్నారు.

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి చేయూత



రిటైల్ చేపల మార్కెట్ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి చేయూతనందిస్తుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల అర్బన్ మండలం మోతె శివారులో గొల్లపల్లి రోడ్‌లో రూ.10 లక్షలతో నిర్మించిన రిటైల్ చేపల మార్కెట్‌ను శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో మత్స్య సంపదను పెంచేందుకు మత్స్యకారులకు ఉచిత చేప పిల్లలు, వలలు, ఇతర సంక్షేమ పథకాలు అందిస్తూ అండగా నిలుస్తున్నారన్నారు. జెడ్పీటీసీ మహేశ్, సర్పంచ్ చురకంటి స్వప్న తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకోవాలి

సారంగాపూర్: క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు తెలుసుకొని తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం బీర్‌పూర్ మండలం కొల్వాయికి చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరగా పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాంచందర్‌గౌడ్, ఆకుల జలేంధర్, గాజర్ల ప్రభాకర్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

ప్రమాదబీమా చెక్కు అందజేత

రాయికల్: పట్టణంలోని గాయత్రీ బ్యాంక్ ఖాతాదారుడు పాల్య దుబ్బరాజం ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందాడు. ఈసందర్భంగా గాయత్రీ నిర్భయ సేవింగ్ ఖాతాపై మంజూరైన రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ బాధిత కుటుంబానికి అందజేసినట్లు బ్రాంచ్ మేనేజర్ బెక్కం నరేశ్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు పాల్గొన్నారు.

లబ్ధిదారులను లంచం అడిగితే జైలుకే

• చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



గృహలక్ష్మి లబ్ధిదారులతో ఎమ్మెల్యే రవిశంకర్

కొండగట్టు(చొప్పదండి): ప్రభుత్వ పథకాల అమలుకు లంచం డిమాండ్ చేస్తే జైలుకు పంపిస్తామని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ హెచ్చరించారు. శుక్రవారం కొడిమ్యాల మండల పరిధిలో 450 కుటుంబాలకు గృహలక్ష్మి ప్రొసీడింగ్స్ అందజేసి మాట్లాడారు. రాష్ట్రంలో ఇల్లు లేకుండా ఎవరూ ఉండకూడదనే సంకల్పంతో సీఎం కేసీఆర్ గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ముందుగా కర్ణాటకలో అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పునుగోటి ప్రశాంతి, నాయకులు పునుగోటి కృష్ణారావు, మేనేని రాజనర్సింగరావు, ఎంపీడీవో పద్మజ పాల్గొన్నారు.

గుడిసెలేని తెలంగాణ సీఎం కేసీఆర్ లక్ష్యం

మల్యాల: తెలంగాణలో గుడిసె లేని రాష్ట్రమే సీఎం కేసీఆర్ లక్ష్యమని ఎమ్మెల్యే రవిశంకర్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం గృహలక్ష్మి పథకం లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. అలాగే బతుకమ్మ చీరలు పంపిణీ చేసి మాట్లాడారు. ఎన్నికల ముందు వచ్చి తర్వాత వెళ్లి పోయే నాయకులకు ఈ ప్రాంతంమీద మమకారం ఉండదని, వారి మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని సూచించారు. స్థానిక బిడ్డనైనా తనను రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఎంపీడీఓ వెంకటేశం, జెడ్పీటీసీ కొండపల్కల రాంమోహన్‌రావు, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మండల మిట్టపల్లి సుదర్శన్, బీఆర్ఎస్ అధ్యక్షుడు జనగం శ్రీనివాస్ పాల్గొన్నారు.

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



రోడ్డుపై బైఠాయించిన ఇప్పపెల్లి గ్రామస్తులు

కథలాపూర్: మండలకేంద్రంలోని కోరుట్ల- వేములవాడ రోడ్డుపై శుక్రవారం ఇప్పపెల్లి గ్రామస్తులు ధర్నా చేశారు. గ్రామశివారులో 50 ఎకరాల్లో ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా యథేచ్ఛగా ప్రభుత్వ భూమిలో ట్రాక్టర్లతో దున్నిస్తున్నారని గ్రామస్తులు మండిపడ్డారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకొని స్వాధీనం చేసుకోవాలని నినాదాలు చేశారు. సుమారు గంటసేపు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. తహసీల్దార్ ముంతాజిబొద్దీన్ అక్కడకు చేరుకొని భూమిని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్‌గౌడ్, నరేందర్ రెడ్డి, నరేశ్‌చారి, అజయ్‌రావు, నారాయణ, నాగిరెడ్డి, కులసంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి హరీశ్‌రావుకు ఘన స్వాగతం



మంత్రికి స్వాగతం పలుకుతున్న నాయకులు

కోరుట్లరూరల్: కోరుట్ల పట్టణంలో శుక్రవారం వంద పడకల ఆసుపత్రి ప్రారంభానికి వచ్చిన రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావుకు మండల నాయకులు ఘన స్వాగతం పలికారు. అయిలాపూర్ రోడ్‌లో హెలిప్యాడ్ వద్ద మంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు. రైతుబంధు జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు, ఎంపీపీ తోట నారాయణ, సర్పంచుల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ కిషన్, ఎంపీఓ నీరజ ఉన్నారు.

జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో కళాశాల బృందం

ధర్మపురి: జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో విద్యార్థులు 24 పతకాలు సాధించి కళాశాలకు గుర్తింపును తెచ్చారని ప్రిన్సిపాల్ రాధాకిషన్ తెలిపారు. వెల్గటూర్ మండలం స్తంభంపెల్లిలో మహాత్మా జ్యోతిబా పూలే సొసైటీ ఆధ్వర్యంలో ఇటీవల జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ధర్మపురిలోని మహాత్మా జ్యోతిబాపూలే కళాశాలకు చెందిన విద్యార్థులు అండర్-19 విభాగంలో విజయకేతనం ఎగురవేశారు. వాలీబాల్‌లో మొదటి స్థానం, ఖోఖో ద్వితీయ స్థానం, అథ్లెటిక్స్ విభాగంలో ప్రతిభచాటి 13 బంగారు, 6 వెండి, 5 కాంస్య పతకాలు సాధించారు. ఇందులో విద్యార్థులు ఎం.రాజశేఖర్ 7, ఎ.హరీశ్ 7, పి. శ్రీకాంత్ 3 పతకాల చొప్పున సాధించారు. రాజశేఖర్ పతకాలతో పాటు వ్యక్తిగత చాంపియన్‌షిప్ గెలుచుకొని రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. ఈసందర్భంగా విద్యార్థులను, ఫిజికల్ డైరెక్టర్ అంజయ్యను ప్రిన్సిపాల్ రాధాకిషన్ అభినందించారు. రాష్ట్ర పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్తంభంపెల్లి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశం, వైస్ ప్రిన్సిపాల్ శ్రీకాంత్, డిప్యూటీ వార్డెన్ రవి, అధ్యాపక బృందం తదితరులున్నారు.

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్



ఇబ్రహీంపట్నం: పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు

ఇబ్రహీంపట్నం/మెట్‌పల్లి: కోరుట్లలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పర్యటనలో భాగంగా ముందస్తుగా శుక్రవారం కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొమిరెడ్డి విజయ్ ఆజాద్ తదితరులను ఉదయం 6గంటలకే ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయినవారిలో ఎర్రొల్ల హన్మండ్లయాదవ్, కౌన్సిలర్ యామ రాజయ్య, ఎండీ రైసొద్దీన్, సురభి అశోక్, పెంట ప్రణయ్, బర్ల వంశీ, ఇరుకుల విజయ్‌పటేల్, పులగం శివ, ఎండీ జకిల్ ఉన్నారు. కాంగ్రెస్ నాయకుల అరెస్టును కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి హన్మండ్లు ఖండించారు. గ్రామాల్లో ప్రజలు విషజ్వరాలతో బాధపడుతుంటే పట్టించుకోని మంత్రి, పూర్తిగా నిర్మాణం కాని వంద పడకల ఆసుపత్రిని ప్రారంభించడం సిగ్గుచేటన్నారు. ఆయన వెంట బందిల ఆనంద్, బందిల కృష్ణమూర్తి, మంతెన గణేశ్, రాజశేఖర్ ఉన్నారు. కాగా ముందస్తు అరెస్ట్ అప్రజాస్వామికమని పీసీసీ కార్యదర్శి షేర్ నర్సారెడ్డి, కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు అందె మారుతి పేర్కొన్నారు. నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం అణిచివేయాలనుకోవడం సరికాదన్నారు.



బతుకమ్మ పాట చిత్రీకరణ

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం జగ్గసాగర్‌లో శుక్రవారం బతుకమ్మ పాట చిత్రీకరించారు. సింగిడి మ్యూజిక్ యూట్యూబ్ చానల్ - వేములవాడకు చెందిన దెబ్బ ప్రశాంత్ దర్శకత్వంలో 'పసుపు గౌరమ్మాయే పూలకే పూజయే' అనే బతుకమ్మ పాటకు సంబంధించిన చిత్రీకరణను గ్రామంలోని రామాలయంలో పూజలు చేసి ప్రారంభించారు.

సేవ చేసేందుకు పోలీస్ ఉద్యోగం దోహదం



మహిపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్: పోలీస్ ఉద్యోగం సేవాభావంతో కూడుకున్నదని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. మండలంలోని అర్పపల్లి గ్రామానికి చెందిన దమ్మ మహిపాల్‌రెడ్డి ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపిక కాగా శుక్రవారం గ్రామస్తులతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ, ఇతర ఉద్యోగాలతో పోలిస్తే పోలీస్ ఉద్యోగం పొందినవారు ప్రజాజీవనంలో మమేకమై ఉంటారని, ప్రజలకు సేవ చేయడానికి ఈ ఉద్యోగం ఎన్నో విధాలుగా దోహదపడుతుందన్నారు. పేద కుటుంబం నుంచి ప్రభుత్వ ఉద్యోగం సాధించిన మహిపాల్‌ను అభినందించారు. బేతి పూర్ణచందర్‌రెడ్డి, అప్పంస్వామి, సూర మహిపాల్, లక్కాడి శ్యాంసుందర్, ఎలిపెద్ది తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ



పెగడపల్లి: చీరలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

కథలాపూర్/పెగడపల్లి/ధర్మపురి/రాయికల్/సారంగాపూర్: కథలాపూర్ మండలం భూషణరావుపేట, చింతకుంట, ఊటొపెల్లి, పెగ్గెర్ల, గంభీర్‌పూర్ గ్రామాల్లో శుక్రవారం బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. సర్పంచులు కూన సులోచన, గజ్జెల స్వామి, భైర హేమలత, పోతు సింధూజ, జవిడి ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పెగడపల్లి మండల కేంద్రంతో పాటు ఎల్లాపూర్‌లో చీరల పంపిణీ కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజేందర్‌రావు, ఎంపీపీ శోభ, సర్పంచులు శ్రీనివాస్, అంజమ్మ, ఎంపీటీసీలు జమున, రవి, ఎంపీడీవో పుల్లయ్య, ఉపసర్పంచులు సాగర్‌రావు, గంగాధర్, మాజీ వైస్ ఎంపీపీ కరుణాకర్‌రావు పాల్గొన్నారు. ధర్మపురి మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, కమిషనర్ రమేశ్ చీరలు పంపిణీ చేశారు. వైస్ చైర్మన్ రామన్న తదితరులు పాల్గొన్నారు. రాయికల్ మండలం కిష్టంపేటలో చీరల పంపిణీ కార్యక్రమంలో సర్పంచ్ జాన స్వరూప, ఎంపీటీసీ జాన సారిక, ఉపసర్పంచ్ రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు చీరలు పంపిణీ చేశారు.

ఆశ వర్కర్ల రాస్తారోకో



ధర్మపురి: రాస్తారోకో చేస్తున్న ఆశ వర్కర్లు

కథలాపూర్/మల్లాపూర్/ధర్మపురి: తమ సమస్యలు పరిష్కరించాలని ఆశవర్కర్లు శుక్రవారం పలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కథలాపూర్ మండలకేంద్రంలోని కోరుట్ల- వేములవాడ రోడ్డుపై ధర్నా చేశారు. ఆశావర్కర్ల ధర్నాకు ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కాశవత్తుల లక్ష్మీరాజం మద్దతు తెలిపారు. మల్లాపూర్ మండల కేంద్రంలోని పలు గ్రామాల్లో భిక్షాటన చేపట్టి నిరసన తెలిపారు. లయ, శిరీష, సరిత, భూదేవి, ప్రేమలత, లావణ్య, స్వప్న, రమ, వసంత, లత, శాంత, మమత, రాజేశ్వరి, మనమ్మ, శారద, నవ్య పాల్గొన్నారు. ధర్మపురిలోని అంబేద్కర్ విగ్రహం జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. యూఐఎఫ్‌యూ జిల్లా కోఆర్డినేటర్ రాజలింగు, ఉపాధ్యక్షురాలు బి.యశోద, ప్రధాన కార్యదర్శి సత్యగంగు, కార్యదర్శి జయ, కోశాధికారి హరిత తదితరులు పాల్గొన్నారు.

బీసీబంధు కిరికిరి



అల్లెపు లక్ష్మి

ఇబ్రహీంపట్నం: తనకే బీసీబంధు మంజూరైందని కానీ తన పేరుతో ఇంకొకరు ఉండటంతో అధికారులు చెక్కు ఇవ్వలేదని మండలంలోని యామపూర్ గ్రామానికి చెందిన వికలాంగురాలు అల్లెపు లక్ష్మి ఆవేదన వ్యక్తం చేసింది. నెల రోజుల క్రితం బీసీబంధు పథకం కింద మొదటి విడతగా కోరుట్లలోని ఓ కళ్యాణమండపంలో చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి తనను రావాలని అధికారులు చెప్పారని, అక్కడ తన సంతకం సైతం తీసుకున్నారని లక్ష్మి తెలిపారు. తర్వాత తనకు మంజురు కాలేదని తన పేరు లాగానే మరో అల్లెపు లక్ష్మి ఉందని, బీఆర్ఎస్ నాయకులు తనను అక్కడి నుంచి వెళ్లగొట్టినట్లు బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈనేపథ్యంలో బీసీబంధు చెక్కు ఇవ్వలేదని బీఆర్ఎస్ నాయకులు వెళ్లగొట్టినట్లు వాట్సప్‌లో వైరల్ అయ్యింది. ఈ విషయమై ఎంపీడీవో ప్రభుకు వివరణ కోరగా, యామపూర్‌లో అల్లెపు లక్ష్మి, భర్త భూమేశ్, మరోకరు అల్లెపు లక్ష్మి భర్త భూమేశ్ ఇద్దరూ ఒకే పేర్లు గలవారు ఉండి మీసేవలో బీసీబంధుకు దరఖాస్తు చేసుకున్నారని, ఇందులో ఒకరికి బీసీబంధు చెక్కు మంజూరు కాగా, ఇద్దరి పేర్లు ఒకే మాదిరిగా ఉండటంతో ఎవరికీ చెక్కు ఇవ్వలేదని పేర్కొన్నారు. బీసీ కార్పొరేషన్‌కు చెక్కును పంపి, వాస్తవంగా ఎవరికి మంజూరైందో తెలుసుకొని వారికి చెక్కు అందజేస్తామని తెలిపారు.

మంత్రి సభకు తరలిన నాయకులు

మల్లాపూర్: కోరుట్ల పట్టణ పరిధిలో 100 పడకల ఆసుపత్రి ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రి హరీశ్‌రావు ఆశీర్వాద బహిరంగ సభకు శుక్రవారం బీఆర్ఎస్ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు 30 బస్సుల్లో తరలివెళ్లారు. జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కాటిపెల్లి సరోజన, వైస్ ఎంపీపీ గౌరు నాగేశ్, రైతుబంధు కమిటీ జిల్లా సభ్యుడు దేవ మల్లయ్య తదితరులు సభకు వెళ్లారు.

కొత్తపేటలో వైద్య శిబిరం

రాయికల్: మండలంలోని కొత్తపేట గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ సతీశ్‌కుమార్ గ్రామస్తులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం దోమల వల్ల మలేరియా, డెంగీ వ్యాధులు సంభవిస్తున్నాయని, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సర్పంచ్ రాజేశ్, ఎంపీటీసీ శ్రీనివాస్, హెచ్ఈవో శ్రీనివాస్, సూపర్‌వైజర్ శ్రీధర్, రత్నమాణిక్యం, ల్యాబ్ టెక్నీషియన్ రాజమణి తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాయికల్: రాయికల్ మండలం ఒడ్డెలింగాపూర్, తాట్లవాయి, ఇటిక్యాల సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ హరీశ్ శుక్రవారం తెలిపారు. చెట్ల కొమ్మలు తొలగించడంలో భాగంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సారంగాపూర్ పరిధిలో..

సారంగాపూర్: మండలంలోని 8 గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సతీశ్ తెలిపారు. 33 కేవీ విద్యుత్ లైన్ల వెంట ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే క్రమంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మండలంలోని నాగునూర్, లచ్చక్కపేట, రేచపల్లి, మ్యాడారంతండా, లచ్చునాయక్‌తండా, భీంరెడ్డిగూడెం, రంగపేట, ఒడ్డెరకాలనీ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

మల్లాపూర్ పరిధిలో..

మల్లాపూర్: 33 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మల్లాపూర్, మొగిలిపేట, కొత్తదాంరాజుపల్లి, వీవీరావుపేట, రాఘవపేట, చిట్టాపూర్, సిరిపూర్, ధర్మారం, రేగుంట సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు మల్లాపూర్, రాఘవపేట ట్రాన్స్‌కో ఏఈలు వినీత్‌రెడ్డి, శివకుమార్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సన్మానం



రఘును సన్మానిస్తున్న చంద్రశేఖర్‌గౌడ్ తదితరులు

రాయికల్/మల్యాల: మండలంలోని కుమ్మరిపల్లికి చెందిన కల్లెడ రఘు కానిస్టేబుల్‌గా ఎంపిక కాగా, శుక్రవారం సన్మానం చేశారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, సర్పంచ్ చింతలపల్లి స్వప్న, ఎంపీటీసీ దొంతి నాగరాజు, ఉపసర్పంచ్ బొంగు రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే మల్యాల మండలం మద్దుట్ల గ్రామానికి చెందిన కూసరి మహిపాల్, ఎండీ.ముజాఫర్ కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించగా సర్పంచ్ కెల్లెటి మల్లమ్మ సన్మానించారు. కెల్లెటి రమేశ్, మ్యాకల మహేశ్, ఉపసర్పంచ్ గౌరమ్మ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.